ప్రజాశక్తి
శుక్రవారం 22 డిసెంబర్ 2023 5 అనంతపురం



ప్రతి ఇంటికీ రేషన్ సరుకులు అందాలి : జెసి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ప్రతి ఇంటికీ సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని ఐదవ రోడ్డులో ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా AePDS యాప్ ద్వారా వాలంటీర్లు చేసే డెజిగ్నేటెడ్ ప్రాంతాల అప్డేట్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా అన్ని సరుకులు ప్రజలకు సక్రమంగా అందాలన్నారు. ఇందులో భాగంగా మరింత పటిష్టంగా వాలంటీర్ల వ్యవస్థను ఇందులో భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. AePDS యాప్ ద్వారా డెజిగ్నేటెడ్ ప్రాంతాలను జిల్లాలోని అందరు వాలంటీర్లు ఆప్షన్ రెండు రోజుల్లోగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ శోభారాణి, తహశీల్దార్ బాలకిషన్, సిఎస్‌డిటి దుర్గాప్రసాద్, సచివాలయం వీఆర్వో, వాలంటీర్లు పాల్గొన్నారు.



గుత్తిలో ప్లేట్లు వాయిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

◆ జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించిన అంగన్‌వాడీలు

◆ 10వ రోజు కొనసాగిన సమ్మె

వేడుకలు మీకు.. అవస్థలు మాకా..!?

'జన్మదినోత్సవం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వేడుకలు చేస్తున్నారు.. కేక్‌లు కట్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. కాగా పది రోజులుగా మేము మా సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్నాం. రోడ్లపైనే వంట వార్పు చేసుకుంటూ అక్కడే భోజనాలు చేస్తున్నాం. కనీసం మా గురించి పట్టించుకునే వారు కరువయ్యారు.. ఓట్లు వేసి గెలిపించినందుకు వేడుకలు మీరు చేసుకుంటూ మాకు అవస్థలు మిగులుస్తున్నారు'.. అంటూ అంగన్‌వాడీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 10వ రోజుకు చేరుకుంది. జిల్లాలో అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ర్యాలీలు, వంటావార్పు, భిక్షాటన తదితర రూపాల్లో అంగన్‌వాడీలు ఆందోళనలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి సమ్మెను విరమింపజేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.



సమ్మె సందర్భంగా బ్రహ్మసముద్రం మండలంలో కళ్లకు నల్లగుడ్డతో గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెలో భాగంగా శిబిరం వద్ద రోడ్డుపై అంగన్‌వాడీలు, సిఐటియు నేతలు ప్లేట్లతో బైఠాయించి మనీప్లాంట్ మొక్క తీగలను మెడ, తలకు చుట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే అంగన్‌వాడీ మెడలకు ఉరితాళ్లే గతవుతాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు ఎస్ఎఫ్ఐ, ముస్లిం మైనార్టీ సంఘాల నేతలు హాజరై మద్దతు తెలిపారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప, బీడీసీగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు, కోకన్వీనర్ చైతన్య, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ తదితరులు మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలుపుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా సంఘాలు, ప్రజలు కలిసి ఉద్యమిస్తామని నేతలు హెచ్చరించారు. వీరి సమ్మెలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, నగర కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, నగర అధ్యక్షుడు భీమేష్, నాయకులు సోము, వసంత్, ఆవాజ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వలి, ముస్కిన్, ఇర్ఫాన్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫిరోజ్, నాయకులు బాబావలి, సొహెల్‌ఖాన్, మానవ హక్కుల వేదిక జాకీర్ హుస్సేన్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షులు మహబూబ్‌బాషా, హ్యూమన్ రైట్స్ నిజాం, మసూద్, ఆవాజ్ నాయకులు ఫక్రు, జాఫర్, ఇమామ్, శర్మాస్, టోపీ బాషా, వలి తదితరులు హాజరై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయ భారతి, జమున తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దంలో 7 ఏళ్లు కరువే..!



◆ శాశ్వత నివారణ చర్యలు శూన్యం

◆ ఎన్నికల సమయంలోనైనా చర్చకొచ్చేనా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లాలో ఈ దశాబ్దకాలంలోనూ అదే కొనసాగింది. గడిచిన మూడేళ్లు కొంత ఊరటనిచ్చినప్పటికీ మొత్తంగా చూసినప్పుడు ఎక్కువ సంవత్సరాలు వర్షాభావమే కొనసాగుతూ వస్తోంది. ఈ ఏడాది అదే పరిస్థితులు అనంతపురం జిల్లాలో నెలకొన్నాయి. 2013-14 నుంచి 2023-24 వరకు చూస్తే పది సంవత్సరాల కాలంలో ఏడు సంవత్సరాలు కరువులు నెలకొన్నాయి. మూడు సంవత్సరాలు మాత్రమే కరువు లేకుండా మంచి వర్షాలు పడ్డాయి. కొత్త జిల్లా ప్రకారం అనంతపురం జిల్లాలో మొత్తం 31 మండలాలుంటే అన్ని మండలాల్లోనే ఏటా కరువు పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ఒక్క ఏడాది 28 మండలాల్లో కరువును ప్రభుత్వం నిర్ణయించింది

ఏడేళ్లు కరువే..!

2013-14 సంవత్సరంలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. తరువాత 2014-15, 2015-16, 2016-17, 2017-18, 2018-19, తాజాగా 2023-24 ఏడు సంవత్సరాలు కరువులే నెలకొన్నాయి. మధ్యలో 2019-20, 2020-21, 2021-22 సంవత్సరాల్లో మాత్రమే వర్షాలు ఒక మోస్తారు పడటంతో కరువులు జిల్లాలో నెలకొనలేదు.

కరువు నివారణకు చర్యలేవి ?

తీవ్రమైన దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో పాలకులు కరువు నివారణ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాకు సాగునీటిని అందించే ప్రధాన ప్రాజెక్టులైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండింటి పరిస్థితి దయనీయంగానే మారింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటిని జిల్లాకు తీసుకురావడంలో అనేక అవాంతరాలు ఏర్పడుతూనే ఉన్నాయి. ఆధునీకరణ పనులను వైసిపి ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. మరో ఐదేళ్లు ఈ పనులు చేపట్టేందుకు వీల్లేదన్న షరతు పెట్టింది. దీంతో ఆధ్వాన్నంగా ఈ కాలువలు పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. హంద్రీనీవాను ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతున్నట్టు వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకటించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. కాని పనులు ప్రారంభమవలేదు. దీంతో ఈ కాలువలోనూ అరకొర నీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యలు ఎన్నికల సమయంపైనైనా చర్చకు వస్తాయా లేదా అన్న చర్చ నడుస్తోంది. జిల్లా సమాగ్రాభివృద్ధి పేరుతో సిపిఎం ఇప్పటికే ఈ అంశాన్ని ప్రజల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధాన రాజకీయపార్టీలైన వైసిపి, టిపిడిలు దీనిపై స్పందించిన దాఖలాల్లేవన్న విమర్శ వ్యక్తమవుతోంది.

సమగ్రాభివృద్ధిపై చర్చకు రావాలి
వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

అనంతపురం వ్యవసాయాధారిత జిల్లా. నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా అభివృద్ధి, వెనుకబాటుతనంపై ఈ ఎన్నికల సమయంలో చర్చకు రావాల్సిన అవసరముంది. ప్రస్తుతం ప్రధాన పార్టీలు దీనిపై కంటే ఇతర అంశాలపైనే ఎక్కువ చర్చ నడుస్తోంది. జిల్లా సమగ్రాభివృద్ధి అంశాన్ని అజెండాలోకి తీసుకొచ్చేందుకు సిపిఎం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే చర్చా వేదికలతోపాటు, రాష్ట్ర స్థాయిలో సభను సైతం ఏర్పాటు చేశాం. వివిధ సందర్భాల్లో ఈ అంశాన్ని ప్రజల ముందు ఉంచే పనిని చేపడుతున్నాం.



అనంతపురం కలెక్టరేట్ వద్ద సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

రెగ్యులరైజ్ చేసేంత వరకూ పోరాటం

2వ రోజు ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్షా అభియాన్ శాఖ అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పలు ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం రెండవ రోజు కొనసాగింది. ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట క్యాలీ ఫ్లవర్‌లు చెవిలో పెట్టుకుని నిరసన తెలిపారు. జేఏసీ జిల్లా ఛైర్మన్ కె.విజయ్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఫోర్టో జిల్లా అధ్యక్షులు లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటనా రాయణ, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యదర్శి సిరాజుద్దీన్, ఎపి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయరాం, ఏపి ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, వెంకటరమణ నాయక్, పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, సిఎంఒ గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, నగర కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, నగర అధ్యక్షుడు భీమేష్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎస్ఎస్ఏలో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. ఎప్పటికైనా రెగ్యులరైజ్ అవుతాయనే నమ్మకంతో పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులరైజ్ చేయాలన్నారు. బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ప్రతి నెల 1వ తేదిన వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు సిపిఎం మద్దతు : రాంభూపాల్

సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పిఆర్‌సి అమలు చేయకుండా, నెలల తరబడి వేతనాలు ఇవ్వాకుండా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయంగా ఉందన్నారు. మినిమం టైమ్ స్కేల్ అమలు చేస్తామని ఇచ్చిన జీవో ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించేందుకు గతంలో ఏ ప్రభుత్వం చేయని కొత్త ఎత్తులు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వేస్తోందని విమర్శించారు. ఒకే క్యాడర్ ఉద్యోగులు రకారకాల వేతనాలు చెల్లించడం పాత వారికి జీతం పెంచకుండా, కొత్తగా నియమితమైన వారికి జీతం పెంచడం ఇందులో భాగమే అన్నారు. గత ఎన్నికల్లో ఎస్-ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఇంత వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్మికులతో చర్చలు నిర్వహించి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు.

చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

అనంతపురం : లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, పి.సుధాకర్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ జాయింట్ కంట్రోలర్ ఎం.గోపికష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. వినియోగదారుని చైతన్యంగా ఉంటనే మోసాలకు అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. ఆన్‌లైన్ వ్యాపారాలపై మరింత అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ దయాకరరెడ్డి, జిల్లా వినియోగదారుల సంఘం పి.రవీంద్రనాథరెడ్డి, కంబదూరి షేక్.నబీరసూల్, ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్, వినియోగ సంఘాల కార్యకర్తలు చెన్నప్ప, చల్లాకిషోర్, హసీనా, మోహన్, అసాదుల్లా పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో అనంత బాలోత్సవం-4

◆ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి ◆ అనంత బాలోత్సవ కమిటీ నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లల పండుగ అనంత బాలోత్సవం-4, 2024ను ఫిబ్రవరి 5, 6, 7వ తేదిల్లో అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు అనంత బాలోత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గతంలో అనంత బాలోత్సవం-4ను ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో నిర్వహించేందుకు కమిటీ తీర్మానించింది. అయితే ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ నిర్వహణ ఉండటంతో నిర్వహణ తేదీని ఫిబ్రవరి 5,6,7వ తేదీలకు కమిటీ సభ్యులు మార్పు చేశారు. బాలోత్సవం నిర్వహణపై గురువారం నాడు ఎన్జీవో హోంలో అనంత బాలోత్సవం కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిటి ఛైర్మన్ డాక్టర్ తిప్పేస్వామి, ప్రముఖ సామాజిక సేవా నిర్వాహకులు రవికాంత్ రమణ, ప్రముఖ నాట్యాచారిని సంధ్యామూర్తి, ప్రముఖ నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కమిటీ సభ్యులు మహమ్మద్ జిలాన్, చిలుకూరి దీవెన, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సరళ, దేవేంద్రమ్మ, విద్యార్థుల కమిటీ నాయకుడు చిన్న ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ తదితరులు హాజరయ్యారు. నిర్వహణ బాధ్యతలపై ఒక్కొక్కరిగా మాట్లాడారు. దరఖాస్తులు పాఠశాలలకు చేర్చడం, రిజిస్ట్రేషన్ చేయించడం, ఈవెంట్స్‌పై వివరించడం, మైదానంలో ఏర్పాట్లు, తదితర అంశాలపై చర్చించారు. స్పాట్ రిజిస్ట్రేషన్లు సాధ్యమైనంత వరకు తీసుకోరాదని నిర్ణయించారు. విద్యార్థులు తప్పకుండా ముందస్తుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రయివేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఆర్‌డిటి ఛైర్మన్ డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి ఇలాంటి ఆట పాటలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. బాలోత్సవాన్ని విజయవంతం చేసి అందరం పిల్లలను ప్రోత్సహిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, యుటిఎఫ్ నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బాలోత్సవం నిర్వహణ కమిటీ నాయకులు

ప్రత్యేక ప్యాకేజీతోనే కరువు నివారణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో కరువు నివారణకు రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాప్తాడు మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో రాప్తాడు, ప్రసన్నాయపల్లి సచివాలయాల్లో సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించేదిగానీ సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. వర్షాభావంతో నష్టపోయిన వేరుశనగ, కంది తదితర పంటలకు ఎకరానికి రూ.50 వేలు, మిరప పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుల పంట రుణాలన్నింటినీ మాఫీ చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులు కల్పించి రోజువారి కూలి 600 రూపాయలను ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మికుల జీవనోఉపాధికి ప్రతి కుటుంబానికీ రూ.25వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలన్నారు. కౌలు రైతులకు కౌలు రద్దుచేసి పంట నష్టపరిహారం కౌలు దారులకు చెల్లించాలన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారందరికీ 14 రకాల నిత్యావసర సరుకులు చౌక డిపో ద్వారా అందించాలన్నారు. రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక కుటుంబాల విద్యార్థుల అన్ని రకాల ఫీజులనూ రద్దు చేయాలన్నారు. రెవెన్యూ గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతులకు 10 లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి ఎం.పోతలయ్య, నాయకులు బి.చంద్రశేఖర్ రెడ్డి, నారాయణస్వామి, లింగనపల్లి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

చరిత్ర సృష్టించిన 'యువగళం' : కాలవ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభ సమకాలీన రాజకీయాల్లో ఓచరిత్రగా నిలిచిపోతుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువగళం ఈ దశాబ్దపు అతిపెద్ద రాజకీయ సభ అన్నారు. లక్షలాది మంది ప్రత్యక్షంగా హాజరై యువనేత లోకేష్‌ను నిండు మనసుతో ఆశీర్వదించారన్నారు. యువగళం నవశకం పేరిట జరిగిన వేడుకకు పెద్దసంఖ్యలో యువకులు హాజరయ్యారని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టీడీపీ ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి బాలకష్ణలను ఒకే వేదికపై చూసిన తర్వాత వైసిపిలో ఓటమి భయం మొదలైందన్నారు. యువగళం పాదయాత్ర ముగింపు కాదని, అది ఒక నూతన నవశకం ప్రారంభాన్ని సూచిస్తుందని అభిప్రాయపడ్డారు. సీఎం జగన్‌రెడ్డి తాడేపల్లి రాజభవనం తలుపులు బద్దలుకొట్టే వరకు సాగే యుద్ధం అన్నారు. రాష్ట్రమంతా ఇప్పుడు గట్టిగా 'హలో ఏపీ..బైబై వైసిపి..! అనాలని ఆయన పిలుపునిచ్చారు.

పోలీసులకు క్రీడలూ ముఖ్యం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

క్రీడలు పోలీసులకు ఎంతో దోహదపడుతాయని 14వ బెటాలియన్ కమాండెంట్ ఆర్.గంగాధరరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని జంతలూరు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ 14వ బెటాలియన్‌లో గురువారం నాడు స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు రేంజ్ ఎపిఎస్‌పి డిఐజి సిహెచ్.వెంకటేశ్వర్లు, కమాండెంట్ ఆర్.గంగాధర్ రావు పాల్గొన్నారు. క్రీడల్లో 100 మీటర్లు పరుగు పందెంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి తగ్గించటం కోసం ప్రతి సంవత్సరం పోలీసు అసోసియేషన్ సిబ్బందికి క్రీడలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎస్కెయు ప్రొఫెసర్ కొమ్మ వేణుగోపాల్ రావు, జెఎన్‌టియు స్పోర్ట్స్ పీడీ జాంబురెడ్డి, డీఎస్పీలు రమణమూర్తి, దామోదర్, ఎఒ నాగభూషణమ్మ, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, రామారావు, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీల ముగింపులో పాల్గొన్న కర్నూలు రేంజ్ ఎపిఎస్‌పి డిఐజి సిహెచ్.వెంకటేశ్వర్లు, కమాండెంట్ ఆర్.గంగాధర్ రావు

విద్యార్థులకు ఏకాగ్రత అవసరం

మహిళా వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ హేమలత



చెకుముకి టాలెంట్ టెస్టు కార్యక్రమంలో మాట్లాడుతున్న డా॥హేమలత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాదించే క్రమంలో ఏకాగ్రత చాలా అవసరం అని మహిళ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ హేమలత తెలిపారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొవ్వూరు నగర్ విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సుగణాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలంటే ఏకాగ్రతతో కూడిన పఠనం ఇప్పటి నుంచే అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచంలో గొప్ప వాళు ఈ రకంగా ఎదిగిన వారే అన్నారు. ఈ సందర్భంగా సమత కన్వీనర్ డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ చదువుతో పాటు శాస్త్రీయ దక్పథం కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని అప్పుడే వెనుకబాటుతనం లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. బావిభారత పౌరులుగా అందరిపై ఈ బాధ్యత ఉందని ఆమె విద్యార్థులను కోరారు. అనంతరం అతిథులు ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. నగరంతో పాటు రూరల్ ప్రాంతం నుండి మొత్తం 33 స్కూళ్ల నుంచి విద్యార్థులు చెకుముకి మండల స్థాయి పరీక్షలో పాల్గొన్నారని జెవివి నగర అధ్యక్షుడు రామిరెడ్డి, చెకుముకి కన్వీనర్ రామకష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు గాంగే నాయక్, ముత్యాలు, సాకె లక్ష్మినారాయణ, నూరుమహమ్మద్, మన్సూర్, నవీన్ కుమార్, లక్ష్మినారాయణ, షేక్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటం



తాడిపత్రి : విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సమ్మెను అణచివేయాలని చూస్తే మరింత ఉధృతం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-తాడిపత్రి

న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం దీనిపై స్పందించకుండా అణచివేయాలని చూస్తే సమ్మె మరింత ఉధృతం అవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హెచ్చరించారు. పట్టణంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో రాంభూపాల్ పాల్గొని సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం చర్చలకు పిలవకపోవడం దుర్మార్గం అన్నారు. పాదయాత్ర నాడు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను జగన్మోహన్‌రెడ్డి అమలు చేసి ఉంటే సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చేది కాదన్నారు. సమస్యల పరిష్కారంపై చర్చలు జరపకుండా మంత్రి బొత్స సత్యనారాయణ అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొడతామని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నిరసన తెలిపితే పరాయి వాళ్లు... బానిసల్లా పనిచేస్తే తమవాళ్లన్నట్లు ప్రభుత్వం చూడడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణా కంటే అధిక వేతనం ఇవ్వాలన్నారు. గ్రాట్యుటీ ఇతర సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షా శిబిరంలో అంగన్వాడీ సిబ్బంది చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలిపారు. బలవంతంగా అంగన్వాడీ కేంద్రాలను తెరిచే బదులు తమ డిమాండ్లను నెరవేర్చితే సమస్య పరిష్కారం అయ్యేదన్నారు.

బ్రహ్మసముద్రం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగనవాడీలు సిఐటియు ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షకు చిన్నారులు సైతం సంఘీభావం తెలిపారు. శిబిరంలో సెక్టార్ లీడర్లు తిప్పీరమ్మ, వరలక్ష్మి, సుజాత, అనిత, వర్కర్లు సుజాత, సంతోషమ్మ, త్రివేణి, ఎర్రమ్మ, సత్యమ్మ, హెల్పర్లు పాల్గొన్నారు.

పదో రోజూ కొనసాగిన అంగన్వాడీల దీక్షలు
వివిధ రూపాల్లో నిరసన

పామిడి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. వీరి దీక్షకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా రైతు సంఘం సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, బాబా మద్దతు పలికారు. దీక్షలో జయంతి, జెఎల్.నారాయణమ్మ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

పుట్లూరు : సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని అంగన్వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి స్పష్టం చేశారు. వీరి దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మద్దతు తెలిపారు. దీక్షలో యూనియన్ మండల అధ్యక్షురాలు జయలలిత, నార్పల ప్రాజెక్టు అధ్యక్షురాలు శ్రీదేవి, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : అంగన్వాడీల దీక్షకు సిఐటియు సహాయ కార్యదర్శి మల్లికార్జున సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిరాహార దీక్షలకు వెనుకాడబోమని హెచ్చరించారు. దీక్షలో ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ, సెక్టార్ లీడర్లు చంద్రకళ, రాధిక, రుద్రమ్మ, మల్లక్క, మెహ్రూన్ పాల్గొన్నారు

శింగనమల : అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. అంగన్వా డీలు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నా యి. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంగన్వాడీల దీక్షకు ఎపి వ్య.కా.సం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న మద్దతు తెలిపారు. దీక్షలో ప్రాజెక్ట్ లీడర్ రమణమ్మ, మండల అధ్యక్షురాలు భారతి, ప్రమీల, ఎర్రిస్వామి, రత్తమ్మ, రాజేశ్వరి, రాధిక, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు శకుంతల హెచ్చరించారు. అంగన్వాడీల ఆధ్వర్యంలో ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో చేపట్టిన దీక్షా శిబిరాలు కొనసాగాయి. దీక్షలకు సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరూపాక్షి, సిపిఐ నాయకులు చెన్నరాయుడు, హమాలీ సంఘం నాయకులు చిన్న ఆంజనేయులు, యానిమేటర్ల సంఘం నాయకులు సుధాకర్, విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, ధనలక్ష్మి, విజయ, శ్వేత నాగు, జ్యోతి, రామంజినమ్మ, స్వర్ణలత, రామాంజనమ్మ, హేమలత, దేవి, లక్ష్మీదేవి, శశికళ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, కృష్ణవేణి, మంజుల పాల్గొన్నారు.



రాయదుర్గం : చెవిలో పూలు పెట్టుకుని నిరసన

బెళుగుప్ప : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు చేపట్టిన దీక్షకు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య మద్దతు తెలిపారు. దీక్షలో సిఐటియు నాయకులు భీమన్న, నారాయణస్వామి, కార్యదర్శి సత్యవతి, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, రాధా, తిలోత్తమ, మారుతమ్మ, అలివేలమ్మ, ఈశ్వరమ్మ, కరిబశమ్మ, చంద్రకళ, టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

గుంతకల్లు : అంగన్వాడీలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. అంగన్వాడీల సమస్యలపై ముద్రించిన కరపత్రాలను స్థానిక హంపీరెడ్డి భవనంలో విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్షలకు సిపిఎం, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపి మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా నాయకుడు జగ్గలి రమేష్, పట్టణ అధ్యక్షుడు రామునాయక్, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, నాయకురాలు లక్ష్మీబాయి, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దాసరి చరణ్ కుమార్, నాయకులు ప్రతాప్, సురేంద్ర, మారుతీప్రసాద్, చొక్కా సునీల్, అబ్దుల్లా, చంద్ర,జాకీర్ తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు చెవిలో పూలు పెట్టుకుని సిఎం జగన్ చిత్రపటం ఉంచి భజన చేస్తూ నిరసన తెలిపారు. వారికి మద్దతుగా సిఐటియు పాల్గొని భజన చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రేష్మా, గంగ, నాగమణి, జూలీ, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, నాయకులు తిమ్మప్ప, బాషా పాల్గొన్నారు.

గుత్తి : దీక్షా శిబిరంలో అంగన్వాడీలు భోజనం ప్లేట్లను గరిటెలతో కొడుతూ శబ్దం చేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. దీక్షకు సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ మద్దతు పలికారు. గుత్తికి వచ్చిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు వినతి పత్రం అందజేశారు.

పెద్దవడుగూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చేస్తున్న దీక్షకు ఆశా వర్కర్లు, రైతు సంఘం దస్తగిరి ఈశ్వర్‌రెడ్డి నాయకులు సంఘీభావం తెలిపారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే తీర్చాలని వారు డిమాండ్ చేశారు.



గుమ్మఘట్ట : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



గుంతకల్లు : సిఎం జగన్ చిత్రపటం వద్ద భజన చేస్తున్న అంగన్వాడీలు



పుట్లూరు: మాట్లాడుతున్న అంగన్వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి



ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన మంజునాథ్, అశోక్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, లావణ్య

రైతు బిడ్డలను వరించిన ఎస్ఐ పోస్టులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండల పరిధిలోని రమనేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లితండా, రమనేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. రమనేపల్లి గ్రామానికి చెందిన రైతు అంజనప్ప, పాలమ్మ దంపతుల కుమారుడు మంజునాథ్, బ్రాహ్మణపల్లి తండాకు చెందిన గోపాల్‌నాయక్, గీతాబాయి దంపతుల కుమారుడు అశోక్‌కుమార్ ఇద్దరూ రైతు కుటుంబానికి చెందినవారే. సాధారణ రైతు కుటుంబం నుంచి చదివి ఎస్ఐగా సెలెక్ట్ కావడంతో గ్రామస్తులు అభినందించారు. సర్పంచి రమేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు యువకులు ఎస్ఐగా సెలెక్ట్ కావడం సంతోషంగా ఉందన్నారు.

నార్పల : ఎస్ఐ పోటీ పరీక్షల్లో మండలానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, లావణ్య ప్రతిభ చూపారు. స్థానిక శాంతి ట్యుటోరియల్ నిర్వాహకులు పరమేశ్వర్‌రెడ్డి కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి, మండల పరిధిలోని నాయనపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు కుమార్తె లావణ్య ఎస్ఐలుగా ఎంపికయ్యారు. జగదీశ్వర్‌రెడ్డి తండ్రి ప్రయివేట్ టీచర్ కాగా లావణ్య తల్లిదండ్రులు కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మండలం నుంచి ఇద్దరు ఎస్ఐలుగా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యం అన్నారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ

ప్రజాశక్తి-పామిడి

స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమస్యలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్ ఆవరణంతో పాటు రిసెప్షన్, లాకప్, కంప్యూటర్, రైటర్ గది పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంపొందించి ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వారి వివరాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, చోరీల కట్టడిపై దృష్టి పెట్టాలన్నారు. సాయంత్రం వేళ రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పెద్దవడుగూరులో స్టేషన్‌లో బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

పెద్దవడుగూరు : ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. ఆయన స్థానిక స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేసులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి నాయకుడి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎఎస్ఐ మధుసూదన్, సిబ్బంది ఉన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్ : ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం : ఆదర్శప్రాయుడు రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొర్రపాడు వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు నిరుపమానం అన్నారు. సిఎం జగన్ ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండలాల ఎస్సీ సెల్ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో 'వై ఎపి నీడ్స్ జగన్'

అనంతపురం : నగరంలోని 50వ డివిజన్ పరిధిలో గురువారం 'వై ఎపి నీడ్స్ జగన' కార్యక్రమం నిర్వహించారు. వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందివ్వడంలో సిఎం జగన్ సక్సెస్ అయ్యాడన్నారు. అది చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎల్లో మీడియా ద్వారా అసత్య ప్రచారం చేయిస్తున్నారన్నారు. నగరంలో రూ. 800 కోట్లతో మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సఫలీకృతు డయ్యారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు వీరా రామకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రమణారెడ్డి, సుజాతమ్మ, అనిల్‌కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్, నరేంద్ర, బిందుప్రియ పాల్గొన్నారు.

ఆర్టీసీ హమాలీ యూనియన్ బోర్డు ఏర్పాటు

పామిడి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేస్తున్న లోడింగ్, అన్ లోడింగ్ హమాలీలు జై శ్రీఆంజనేయ ఆర్టీసీ హమాలీ యూనియన్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హమాలీ యూనియన్లకు ఆర్థిక తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, హమాలీలు నాగేంద్ర, మంజు, రాజు, సలీం, రియాజ్, శివ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనిదినాలు పెంచాలి

శింగనమల : ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచడంతో పాటు కూలీలకు బకాయి ఉన్నా వేతనాలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కారదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం గ్రామ సచివాలయ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రైతుల అప్పులు మాఫీ చేయాలని, కౌలు రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుంకన్న, సూర్యప్రకాష్, ఎర్రిస్వామి, జయరాముడు, రామాంజనేయులు, ఓబులేసు, లక్ష్మీనారాయణ, కేశన్న, మునెప్ప, ఆంజనేయులు, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

అనంతపురం : విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి సూచించారు. నగరంలోని బిసి స్టడీ సర్కిల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ముందుగా ఖుష్బూ కొఠారి 212 మందికి రైటింగ్ పాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. మల్లేష్ విద్యార్థులకు రూ. 10వేల విలువ చేసే జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. సబ్జెక్టు టీచర్స్ విద్యార్థులకు సబ్జెక్టుల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ సుభాషిణి, మోటివేటర్ నరేష్, వసతి గృహ సంక్షేమ అధికారులు కంబయ్య, మారుతిప్రసాద్, తాగూర్, నాగరాజు, నారాయణనాయక్, శ్రీనివాసులు, అరుణ, రాజేశ్వరి, శిరీష, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి

క్రీడాకారులకు ఆర్థికసాయం

అనంతపురం : తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ త్రోబాల్ రాష్ట్ర జట్టుకు రాప్తాడు జడ్పి హైస్కూల్ విద్యార్థులు నరసింహ, అంజలిప్రియ, ఇందు ఎంపికయ్యారు. వీరికి సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు రూ. 5 వేల చొప్పున రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహులు, పిడిలు రాజశేఖరరెడ్డి, ఎన్.కేశవమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



జూనియర్ త్రోబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన రాప్తాడు జడ్పి హైస్కూల్ విద్యార్థులతో రామాంజనేయులు



ప్రజలతో మాట్లాడుతున్న జెసి అస్మిత్‌రెడ్డి

హుస్సేనాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా గురువారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో పర్యటించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అస్మిత్ మాట్లాడుతూ రానున్నది చంద్రబాబు ప్రభుత్వమే అన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వెంకట రాముడు ఇంట్లో తేనేటి విందు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, కార్యకర్తలు రంగనాయకులు, ఉపేంద్ర, శ్రీనివాసులు, మల్లి, శీను, హరి, సాయికుమార్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం : స్పిక్ కంపెనీకి చెందిన 1,166 మెట్రిక్ టన్నుల ఎరువులు గురువారం నగర శివారులోని ప్రసన్నాయపల్లి రేక్ పాయింట్‌కు వచ్చినట్లు ఎడిఎ రవి తెలిపారు. అందులో యూరియా 597, డిఎపి 399, 20:20:0:13 173 మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. వాటిని ఎడిఎ పరిశీలించి జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారికి నివేదించినట్లు తెలిపారు

కాంక్రీట్ దిగబడడంతో నలుగురికి గాయాలు

రాయదుర్గం : పట్టణంలోని తేరు వీధిలో ఓ హోటల్‌లో గురువారం ఉన్నఫళంగా కాంక్రీట్ దిగబడడంతో గుంతలో పడి అక్కడ పనిచేస్తున్న నలుగురు గాయపడ్డారు. పాత కట్టడం స్థానంలో ఏర్పాటు చేసిన ఓ హోటల్‌లో వంట చేస్తుండగా ఒక్కసారిగా కాంక్రీట్ వదులై గుంతలోకి పడ్డారు. ఈ ఘటనలో వంట చేస్తున్న మారన్న, గీతమ్మ, రామాంజనేయులు, తిప్పేష్, సిద్దన్న గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

రాయదుర్గం : యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం పిలుపుమేరకు గురువారం గుమ్మఘట్ట శాఖ ప్రతినిధులు ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల కరువు భత్యం, వేతన సవరణ, సరెండర్ లీవ్ బకాయిలు, ఎపిజిఎల్ఐ, ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, తదితర ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవికుమార్, గుమ్మఘట్ట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

2023 రబి సీజన్‌కు సంబంధించిన ఈ క్రాప్ నమోదును వేగవంతంగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. స్థానిక వీరసేవ కళ్యాణ మండపంలో గురువారం డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులతో ఎడిఎ పద్మజ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ నెలాఖరు లోపు ఈ క్రాప్ నమోదుతో పాటు రైతుల ఈ కేవైసీ వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల వివరాలు ప్రదర్శించాలన్నారు. నూతన పాసు పుస్తకాలు తీసుకున్న రైతులు ఆర్‌బికెలో పిఎం కిసాన్ కోసం నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో టెక్నికల్ ఎఒలు రాకేష్ నాయక్, బాలునాయక్, వెంకటకుమార్, ఎఒలు శుభకర్, పెన్నయ్య, మధుకర్, స్వాతి, ఎఇఒలు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే వైవిఆర్

ప్రజాశక్తి-గుత్తి

సిఎం జగన్ విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు సచివాలయంలో గురువారం స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. సిఎం జగన్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని గాంధీ కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో మండలంలోని 240 మంది లబ్ధిదారులకు సాగు భూమి పట్టాలు అందజేశారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జి.శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపిపి జి.విశాలాక్షి, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, వైస్ ఛైర్‌పర్సన్లు బి.పద్మలత, బి.వరలక్ష్మి, నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్ రెడ్డి, కోనా మురళీధర్‌రెడ్డి, బి.రాజ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎన్.ఫారూఖ్, వాల్మీకి శివ, వరద, రమణ, నాయకులు ఎ. సూర్యనారాయణ రెడ్డి, ఎం. రంగస్వామి, ఎస్.రాము యాదవ్, ఎన్.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్

సొంతింటి కల నెరవేర్చిన సిఎం జగన్

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద గురువారం సర్పంచి లలిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు పట్టణంలోని రాయపల్లి లేఅవుట్‌లో కేటాయించిన ఇళ్ల పట్టాలను 300 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. గతంలో 14 సర్వే నంబర్లు వేసి దొంగ పట్టాలు పంపిణీ చేసి మోసం చేసిన ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఎన్నికల్లో మహిళలు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అమృత్‌రాజ్, తహశీల్దార్ శ్రీధర్‌రావు, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, కురుబ, ఎంబిసి డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, చంద్రమ్మ, బిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, ఓబన్న, బసవరాజు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న విశ్వ, ప్రణయ్ రెడ్డి

జెఎన్‌టియులో ఇద్దరికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో రెగ్యులర్ ఉద్యోగులుగా పని చేస్తూ మృతిచెందిన ఇద్దరి కుటుంబ సభ్యులకు గురువారం ఉప కులపతి ఆచార్య రంగజనార్ధన కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. విసి మాట్లాడుతూ స్వీపర్ ఎస్.ముత్యాలప్ప మృతి చెందగా కుమారుడు ఎస్.మూర్తి ప్రసాద్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా, ఒటిపిఆర్ఐ కళాశాల స్వీపర్ ఎ.సుశీలమ్మ మృతితో కుమారుడు ఎ.శివసాయికుమార్‌ను టైపిస్టుగా నియమిస్తూ విసి ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఇ.అరుణ క్రాంతి, డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్, యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళీమోహన్‌రావు పాల్గొన్నారు.



పంచాయితీ కార్యదర్శి వెంకటేశులుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కరువు మండలంగా ప్రకటించాలి

బెళుగుప్ప : బెళుగుప్పను కరువు మండలంగా ప్రకటించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పంచాయితీ కార్యదర్శి వెంకటేశులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు భీమన్న, మల్లికార్జున, నారాయణస్వామి పాల్గొన్నారు

పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లో బాలుడు

పుట్లూరు : పుట్లూరుకి చెందిన ఎరికల వెంకటేష్ కూతురు అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి కాన్పు కోసం వెళ్లింది. ఆసుపత్రిలో వారి వద్దకు సుమారు ఆరేళ్ల బాలుడు రావడంతో చేరదీసి భోజనం పెట్టారు. ఆ తర్వాత కూడా బాలుడు వారిని విడిచి వెళ్లకపోవడంతో వెంట తీసుకొచ్చారు. ఆ బాలుడు తన పేరు భరణి అని చెబుతున్నాడే కానీ తల్లిదండ్రుల వివరాలు తెలియదని చెప్తున్నాడు. బాలుడిని ఎవరైనా గుర్తిస్తే పుట్లూరు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు విరాళం

రాయదుర్గం రూరల్ : డి.హీరేహాళ్ మండల పరిధిలోని కాదలూరు గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు గురువారం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప రూ. 10,100 విరాళం అందజేశారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, మారెన్న, హరీష్‌కుమార్, రాజప్ప, ప్రకాష్, సిద్ధలింగప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న బండి కిష్టప్ప

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం : విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎస్కేయూ విద్యార్థి సంఘాలు వైఎస్సార్‌ఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ నాయకులు విసి చింతా సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి లింగారెడ్డి, హేమంత్ కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు మాట్లాడుతూ మహానంది హాస్టల్‌ను యధావిధిగా కొనసాగించాలని, పీజీ ఎంట్రెన్స్ రాయని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని, తదితర సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు వాసు, శంకర్, రాము, నవీన్, శివ, నాగేంద్ర, మారెన్న, నందిగామ సురేష్, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సిఎం జగన్

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యేలు, నాయకులు



ఆత్మకూరులో...



పామిడిలో మహిళలకు రుణచెక్కును అందిస్తున్న వీరాంజినేయులు, లిఖిత



ఎస్‌కెయు వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు...

ప్రజాశక్తి-శింగనమల

సిఎం జగన్ సంక్షేమ ప్రదాతగా చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఐటి కళాశాలలో గురువారం ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి ఆధ్వర్యంలో సిఎం జగన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 430 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్సీ శమంతకమణి, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, సింగిల్‌విండో ప్రెసిడెంట్ శ్రీరామ్‌రెడ్డి, ఆలూరు రమణారెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, ఎపి రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల పరంధామ రెడ్డి, వెంకటనారాయణ, శెట్టిపల్లి నరసింహారెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, వీరాంజనేయులు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పామిడి : మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పాలాభిషేకం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచి నరసింహ, ఈశ్వర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సూరి, రజాక్, సాలయ్య, రామచంద్ర, నాగేష్ , బెనకల రామిరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

రాయదుర్గం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలోని వినాయక కూడలిలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు కట్ కట్ చేశారు. ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తన నివాసంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. 1998-డీఎస్సీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, కాపు ప్రవీణ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, పట్టణ కన్వీనర్ శివప్ప, లక్ష్మీకాంతరెడ్డి, ఎన్‌టి.సిద్ధప్ప, శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కౌన్సిలర్లు, నాయకులు, 98 డీఎస్సీ ఉపాధ్యాయులు శర్మాస్ సాహెబ్, ముష్టూరురెడ్డి, యూనస్, వీరేష్, ఇబ్రహీం, ఈశ్వర్‌రెడ్డి, రహీమ్, సుమలత, శాంతకుమార్, గౌస్, కిషోర్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మాజీ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి మున్సిపల్ కార్మికులకు దుస్తులు, దుప్పట్లు, సబ్బులు, చెప్పులు, నూనె, తదితర పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శారద, గోవిందరాజులు, గజాల, గోవింద, పెద్దవన్నూరప్ప, చెన్న వీరస్వామి, పద్మజ, లావణ్య, కో ఆప్షన్ సభ్యులు బ్యులా, నజీర్, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప పాల్గొన్నారు.

నార్పల : స్థానిక శ్రీసత్యసాయి బాలబాలికల అనాథాశ్రమం లో వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, నాటక అకాడమీ మాజీ ఛైర్‌పర్సన్ చామలూరు రాగే హరిత 2 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి సిఎం జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి పవన్ సిద్దారం పురం సర్పంచి సాకే రామాంజనేయులు, బండారు నగేష్, బడిగే శ్రీధర్, మైలార్ కుమార్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షులు జోజోడే కుమార్ ఆధ్వ ర్యంలో స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి, బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, యాపిల్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు టిటి నాగభూషణరావు, బాలిరెడ్డి, వెంకట్‌గుప్తా, చీమల నాగేష్, అక్కిలి శివారెడ్డి, ఖాదర్ పేట సర్పంచి దామోదర్‌రెడ్డి, చంద్ర, మనోజ్, నవీన్ కుమార్, హరికిషన్, సందీప్, ప్రవీణ్, నీలూరు హరి, రమేష్, జాఫర్, కార్తీక్, గోపి, శీన, పటాన్, నాగార్జున, పవన్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యఅతిథి తోపుదుర్తి నయనతారెడ్డి స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద హాజరై కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కెజిబివిలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి హేమలత, మండల కన్వీనర్ నరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఓబి, టైలర్ వెంకటేష్, ఆంజనేయులు, శ్రీరాములు, వెంకటేశులు, బాల పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ వీరాంజనేయులు ఆధ్వర్యంలో వెయ్యి మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ లిఖిత సహకారంతో 6 మహిళా సంఘాలకు రూ. 1.03 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కాయల మహేష్, రాజశేఖర్, పసల నాగరాజు, ధను, కత్రిమల సుధాకర్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బెళుగుప్ప : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వైసిపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిల జిల్లా సంఘం అధ్యక్షులు, ఎంపిపి పెద్దన్న త్రిలోకనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మచ్చన్న, అధ్యక్షులు శివలింగప్ప, రామాంజనేయులు, పి.శ్రీనివాసులు, రమేశ్వర్‌రెడ్డి, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, కె.గోపాల్, గోవింద్ రెడ్డి, కేశవరెడ్డి, తిమ్మారెడ్డి, నరిగన్న, భాస్కర్‌రెడ్డి, రాము, నరసింహారెడ్డి, అనిల్, ధనుంజయ పాల్గొన్నారు.

అనంతపురం : ఎస్కేయూ ఆవరణలో వైఎస్‌ఆర్‌ఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 51 కిలోల కేక్‌ను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎస్కేయూ ప్రిన్సిపల్ కృష్ణకుమారి కట్ చేశారు. కార్యక్రమంలో మద్దిరెడ్డి నరేందర్‌రెడ్డి, తిప్పలూరు సుధీర్ రెడ్డి, పి.హేమంత్‌కుమార్, కిరణ్, అంకె శ్రీనివాసులు, వాసు, శివ, మహేష్, తేజేశ్వర్‌రెడ్డి, బి.జయచంద్రరెడ్డి, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ విగ్రహావిష్కరణ

అనంతపురం రూరల్ రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు కొట్టాలలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున కేక్ కటింగ్ చేసి జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. సర్వజనాస్పత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. నాయక్‌నగర్‌లో కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద సాంస్కృతిక విభాగం రిలాక్స్ నాగరాజు ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, నగర అధ్యక్షులు సోమశేఖరరెడ్డి, రుద్రంపేట సర్పంచి సుగాలి పద్మావతి, అగ్రి అడ్వయిజరీ బోర్డ్ ఛైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, ఎంఎస్ఎస్ సంస్థ సాధిక్ వలి, ఎంపిటీసీ మహబూబీబీ పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత

'ఆడుదాం ఆంధ్ర'కు పూర్తిస్థాయి ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్



అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం నాడు అనంతపురం నగరంలోని పిటిసి గ్రౌండ్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ కార్యక్రమం కోసం పిటిసి గ్రౌండ్‌లో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డిఎస్‌డిఒ నరసింహారెడ్డి, డీఎల్డీవో ఓబులమ్మ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఆయా శాఖల అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర నిర్వహణకు సిద్ధంకండి

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకోసం అన్ని విధాలా సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈనెల 26వ తేదీన ప్రారంభించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఒలు, డిఎస్‌డిఒ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి సచివాలయం పరిధిలోనూ ప్రారంభించాలన్నారు. గురువారం నాటికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో రెండు రోజుల్లోగా టీంల ఏర్పాటు పూర్తి కావాలన్నారు. శుక్రవారంలోగా సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించుకుని అన్ని విధాలా సిద్ధం కావాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎస్‌డిఒ నరసింహారెడ్డి, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సాగునీటితోనే కరువు దూరం

హంద్రీనీవా వెడల్పు, ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి

హెచ్ఎన్ఎస్ఎస్ సిఇకి జలసాధన సమితి వినతి

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యం కరువుకు నిలయం అయిన అనంతపురం జిల్లాకు సాగునీరు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జలసాధన సమితి నాయకులు తెలిపారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయడంతోపాటు, ఉంతకల్లు రిజర్వాయర్లు పూర్తి చేయాలని కోరుతూ ఆ సమితి ఆధ్వర్యంలో గురువారం నాడు హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులరెడ్డి, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఎస్ఇ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షులు రామ్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, రైతు కూలీ సంఘం నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి ఉపేంద్ర తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలోనున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం కరువులకు నియలమైన అనంతపురం జిల్లాకు సాగునీటి అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. 2019లో వైసిపి అధికారంలోకి వస్తూనే హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. రూ.6182 కోట్లకు పరిపాలనపరమైన అనుమతులిచ్చారు గానీ పనులు చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా ఈ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎల్‌సి ఎస్ఇని కలసి ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టే విధంగా ప్రభుత్వాన్ని కోరాలని డిమాండ్ చేశారు. పిఎబిఆర్ ఎగువ భాగంలో ఒక ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాల్సిన అవసరముందని తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

రాయదుర్గం : స్థానిక కెజిబివిలో 45 మంది విద్యార్థినులకు ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ట్యాబ్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా విద్యారంగంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు నాగమణి, వెంకట రమేష్, ఎస్ఒ వెంకటలక్ష్మి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప, గౌని ఉపేంద్ర రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, కౌన్సిలర్లు పద్మజ, శారద, లావణ్య, కో ఆప్షన్ సభ్యులు నజీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ ఐ.శ్రీనివాసులు, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

నార్పల : స్థానిక బాలికల హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థినలకు జడ్పి వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావుసుప్రియ, నార్పల సత్యనారాయణరెడ్డి విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణయ్య నారపరెడ్డి, పల్లె భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం నాగేష్, ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు, వైసిపి నాయకులు బాలనాగి, బయన్న, చికెన్ గోపాల్, గవ్వల ప్రవీణ్, భాస్కర్‌నాయుడు, శివయ్య, శివశంకర్, కోనంకి రంగయ్య, లక్ష్మిరెడ్డి, నాగలింగారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, దుర్గం సర్పంచి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ సత్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 80 మంది విద్యార్థులకు తహశీల్దార్ వాణిశ్రీ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భైరవాణి తిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, ఎంపిడిఒ దాసనాయక్, ఎంఇఒ ఓబుళపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు జయానాయక్, సత్యనారాయణ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ హాజరయ్యారు. హెచ్ఎం రామ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. టెక్నాలజీలో ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో విద్యార్థినికి ట్యాబును అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రం : స్థానిక జడ్పి హైస్కూల్‌లో ఎంపిపి దాసరి సునీత 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, ఎంఇఒ లింగానాయక్, హెచ్ఎం వసుంధర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

నార్పల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి, హెచ్ఎం రవికుమార్, ఐఇడి స్పెషల్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బెళుగుప్ప : ఎంపీటీసీల సంఘం జిల్లా సంఘం అధ్యక్షులు, ఎంపీపీ పెద్దన్న ఆధ్వర్యంలో కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని ఆయన తెలియజేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుని అభివృద్ధివైపు పయనించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఎంఇఒ మల్లారెడ్డి, జెడ్పిటిసి మమత త్రిలోక్ రెడ్డి, వైసిపి కన్వీనర్ మచ్చన్న, కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్న బాయి తదితరులు పాల్గొన్నారు.

కొన్ని పాఠశాలలకే ట్యాబ్‌లు

పుట్లూరు : మండల వ్యాప్తంగా గురువారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రమే ట్యాబ్‌లు పంపిణీ చేయడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని పాఠశాలలకు అసలే రాకపోవడం, కొన్ని పాఠశాలల్లో అరకొర పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మండిపడితున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పుట్లూరు, కడవకల్లు జడ్పి హైస్కూళ్లకు ఒక ట్యాబ్ కూడా రాలేదు. కెజిబివి, ఆదర్శ పాఠశాలలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఎంఇఒ శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలి

బుక్కరాయసముద్రం : స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న 71 సెంట్ల స్థలాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ కోసం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు ఆ స్థలంలో అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రంగాపురం పుల్లప్ప, దాసగానిపల్లి కుళ్లాయప్ప, బడిగ రాజు, లోలూరు కుళ్లాయప్ప, లింగమయ్య, వెంకటాపురం చంద్ర, తరిమెల రామాంజనేయులు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, దండువారిపల్లి నారాయణ స్వామి, రామాంజనేయులు, చిన్న ఆంజనేయులు, హనుమంతు, గంగయ్య, జంతలూరు మారన్న, చెన్నంపల్లి రాజు, రాచపల్లి శీన, తదితరులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

పుట్లూరు : రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబాయి ఆధ్వర్యంలో గురువారం కడవకల్లు జడ్పి హైస్కూ ల్‌లో జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హెచ్ఎం ఖాదర్ మోహిద్దీన్, ఉపాధ్యా యుల సమక్షంలో విజేత విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిత్రలేఖనం ఉపాధ్యాయులు రాజశేఖర్ పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలు విడుదల

గుంతకల్లు : పట్టణంలోని భగత్‌సింగ్ మున్సిపల్ పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఎంఇఒలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని, మూఢనమ్మకాలు విడనాడాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షులు కె.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు శంకరయ్య, ఎల్లన్న, పెద్దయ్య, ఉపాధ్యాయులు దిలీప్, రమేష్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి జిల్లా స్థాయి పరీక్షలకు కెజిబివి విద్యార్థినులు

రాయదుర్గం : డి.హీరేహాల్ జడ్పి హైస్కూల్‌లో గురువారం జన విజ్ఞాన వేదిక మండల కార్య నిర్వాకులు జగదీష్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహించగా డి.హీరేహాల్ కెజిబివి జట్టు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. వారిని ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో హెచ్ఎం రామాంజనమ్మ, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.మోహన్‌బాబు, జి.రామాంజనేయులు, సైన్స్ ఉపాధ్యాయులు నాగరాజు, హరినాథ్, వాణి, వరలక్ష్మి, అనిత, తెలుగు ఉపాధ్యాయులు ఉరుకుందప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

గుత్తి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం గుత్తిలో సైన్స్ సంబరాలు జరిగాయి. అందులో భాగంగా విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షులు ఎ.రామాంజనేయులు, జిల్లా నాయకులు శ్రీధర్‌గౌడ్, దేశాయి నాగరాజు, సీతానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంచడమే చెకుముకి లక్ష్యం

రాయదుర్గం : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడమే లక్ష్యంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచే లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో గురువారం మండల, పట్టణ స్థాయి చెకుముకి సైన్స్ టెస్టు నిర్వహించారు. ముందుగా ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో చెకుముకి జిల్లా కన్వీనర్ జగదీష్, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్, రాయదుర్గం శాఖ అధ్యక్షులు వీరన్న, సిద్ధప్ప పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఉరవకొండ : ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్‌సిపిడబ్ల్యూఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం ఇచ్చేలా కృషి చేయాలని కోరుతూ గురువారం ఆ సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య విభాగాల్లో సుమారు 15 వేల మంది థర్డ్ పార్టీ కాంట్రాక్టు వర్కర్స్‌గా 25 ఏళ్లుగా పని చేస్తున్నామన్నారు. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో వర్కర్స్ శ్రీనివాసులు, మల్లికార్జున, రామంజి, మూర్తి, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాల్ బ్యాడ్మింటన్ డే

గుత్తి : పట్టణంలోని క్రీడా మైదానంలో గురువారం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్జున అవార్డు గ్రహీత జమ్మలమడక పిచ్చయ్య జయంతి సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోనంకి కృష్ణ, నాగరాజు, కోశాధికారి వేణుగోపాల్, నాయకులు నారాయణస్వామి, దాదా, దాసా రమేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్‌లో విద్యార్థినుల ప్రతిభ

పామిడి : జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ టిసి హైస్కూల్ విద్యార్థినులు ఎం.కళావతి, ఎం.సుజాత ప్రతిభ చాటారు. వినియోగదారుల హక్కులు, రక్షణ, ఈ-కామర్స్, డిజిటల్ చెల్లింపులు, తదితర అంశాలకు సంబంధించి నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని హెచ్ఎం రామ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నార్పల విద్యార్థి

నార్పల : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన వికలాంగ విద్యార్థి కార్తీ ఈ నెల 24వ తేదీ విశాఖపట్టణంలో జరిగే పారా స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవికుమార్ తెలిపారు. 200 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్ విభాగాల్లో పాల్గొంటాడని తెలిపారు. పిడి ఆంజనేయులు, పిఇటి నసీమాబేగం, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రాజేశ్వరికి అభినందనలు తెలిపారు.